సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 21 । జూన్ । 2024



పోచమ్మ బోనాలు

జూలపల్లి: అబ్బాపూర్‌లో గురువారం పోచమ్మతల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. బోనాలతో శోభాయాత్రగా ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.



పాటల పల్లకిలో..

వస్త్రోత్పత్తి ఖిల్లా సిరిసిల్ల .. మరమగ్గాల సవ్వడు మధ్య స్వరాగాల సవ్వడులు సందడి చేస్తున్నాయి. ఎందరో గాయకులు ఇక్కడ పాటలు రికార్డు చేసుకునే స్టూడియోలు ఉన్నాయి. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.0 /26.0

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలుగా పోలీస్‌స్టేషన్లు



మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని: పోలీస్‌స్టేషన్లు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలుగా మారుతున్నాయని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. గురువారం మంథనిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లోనే కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ జెడ్పీటీసీ భర్త నృత్యం చేయడం ఇందుకు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ కండువా కప్పుకునే పోలీసు అధికారులకు మాత్రమే ఇక్కడ పోస్టింగ్‌లు ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలోని ప్రఖ్యాతిగాంచిన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి సన్నిధిలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఓ మహిళా కానిస్టేబుల్‌పై అఘాయిత్యానికి పాల్పడటాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలని తెలిపారు.

నీట్‌ను రద్దు చేసి తిరిగి నిర్వహించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

జ్యోతినగర్: అక్రమాలు చోటు చేసుకున్న నీట్-2024ను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని కోరుతూ గురువారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షకు ముందే గుజరాత్, బీహార్ రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలు లీకేజీ చేసిన ముఠాలు లక్షలాది రూపాయలు వసూలు చేశారని అన్నారు. న్యాయవిచారణ జరిపించి నేరస్తులను గుర్తించి కఠినంగా శిక్షించడంతో పాటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గీట్ల లక్ష్మారెడ్డి, భిక్షపతి, శంకర్, నాగలక్ష్మి, సంపత్, సాంబయ్య, హుస్సేన్ రెడ్డి, ఉదయ్, నారాయణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.


బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనవద్దు



సంఘీభావం ప్రకటిస్తున్న జేఏసీ నాయకులు

గోదావరిఖని: బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి సంస్థ పాల్గొనవద్దని కార్మిక సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ రియాజ్‌అహ్మద్, నాయకులు ఐ.కృష్ణ, నేరటి రాజన్న, రాములు అన్నారు. గురువారం హెచ్ఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జేఏసీ సమావేశంలో వారు మాట్లాడారు. బొగ్గుబ్లాకుల వేలంలో సింగరేణి, రాష్ట్ర ప్రభుత్వం పాల్గొనడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. తక్షణమే ఈనిర్ణయాన్ని ఉపసంహరించుకోవా లని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై ఈనెల 21న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్రం మైనింగ్ పాలసీ తీసుకొచ్చి గనులను ప్రైవేటీకరించి కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడాన్ని పదేళ్ల నుంచి చూస్తున్నామని అన్నారు. గుజరాత్‌లో ఏవిధానమైతే అమలు జరుగుతుందో తెలంగాణలో కూడా అదే జరగాలని దానికి కావల్సిన చర్యలు చేపట్టాలని అన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వేలం ప్రక్రియను తిప్పి కొట్టాలన్నారు. కార్మికులంతా ఉద్యమానికి సిద్ధం కావాలని కోరారు.

క్యూఐఎస్‌ను పటిష్టంగా అమలు చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి క్వార్టర్లు అన్యాక్రాంతం కాకుండా క్యూఐఎస్(క్వార్టర్స్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం)ను పటిష్టంగా అమలు చేయాలని కార్పొరేట్ ఏజీఎం శ్రీనివాస్ అన్నారు. గురువారం అన్ని ఏరియాల పర్సనల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. క్వార్టర్లకు సంబంధించిన అన్ని కార్యక్రమాలు ఈవిధానం ద్వారా ముందుకు సాగాలన్నారు. వెకేషన్, అలాట్‌మెంట్, క్వార్టర్‌కు సంబంధించిన అన్ని వివరాలను నమోదు చేయటం వల్ల వివరాలను సులువుగా, ఖచ్చితంగా భద్రపర్చవచ్చన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, ఎస్ఈ సివిల్ వరప్రసాద్, ఎస్టేట్ అధికారి బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పైసలా.. బియ్యమా..!

ఈనెల 13న సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి గ్రామ చౌకధరల దుకాణంలో రెవెన్యూ అధికారులు తనిఖీ చేయగా 105 బస్తాలు అనగా 52.50 క్వింటాళ్ల బియ్యం వ్యత్యాసం ఉంది. దీంతో ఆ దుకాణాన్ని సీజ్ చేశారు.

ఈనెల 11న ధర్మారం మండలం రామాయపల్లి గ్రామ చౌక ధరల దుకాణంలో తనిఖీలు నిర్వహించగా.. రికార్డుల ప్రకారం దుకాణంలో రెండు క్వింటాళ్ల 42 కిలోల బియ్యం తక్కువ స్టాక్ ఉండడంతో డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు.

ఈనెల 6న గోదావరిఖనిలోని అడ్డగుంటపల్లికి చెందిన రేషన్‌షాపును తనిఖీ చేసి 6.20 క్వింటాళ్లు అదనంగా ఉన్నట్లు గుర్తించారు. ఈమేరకు డీలర్‌పై కేసు నమోదు చేశారు. ఇలా అధికారుల తనిఖీల్లో రేషన్ దుకాణాల్లో కేటాయించిన కోటాలో రిజిస్టర్‌లో ఉన్న వాటికి వ్యత్యాసాలు ఉంటున్నాయి. దీనికి ప్రధాన కారణం సదరు బియ్యాన్ని పక్కదారి పట్టించడమే కారణం.

- లబ్ధిదారులను నేరుగా అడుగుతున్న కొందరు డీలర్లు
- రేషన్ దుకాణాలపై పర్యవేక్షణ లేకే అక్రమాలు
- పలువురు డీలర్ల నుంచి నేరుగా రైస్‌మిల్లులకు బియ్యం తరలింపు



సుల్తానాబాద్ గట్టెపల్లి రేషన్‌షాప్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు (ఫైల్)

సాక్షి, పెద్దపల్లి: నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలనే సంకల్పంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆహార భద్రత పథకం కొందరు అక్రమార్కుల వల్ల పక్కదారి పడుతోంది. పలు రేషన్ దుకాణాల్లో బియ్యం కావాలా? బియ్యంకు సరిపోయే డబ్బులు కావాలా అడుగుతూ డబ్బులిచ్చి బియ్యాన్ని తమ వద్దే ఉంచుకుంటూ దందా కొనసాగిస్తున్నారు. రేషన్ దుకాణాలపై అధికారుల పర్యవేక్షణ లేకే అక్రమాలు చోటు చేసుకుంటున్నారు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం పూర్తి స్థాయిలో నెరవేరటం లేదు.

జిల్లాలో రేషన్ దుకాణాలపై నమోదు చేసిన కేసులు	17
పట్టుబడ్డ బియ్యం	428 క్వింటాళ్లు
అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డ కేసులు	28
పట్టుకున్న బియ్యం	761 క్వింటాళ్లు

వేలిముద్రలు వేసుకొని..

జిల్లాలో 413 రేషన్ దుకాణాల ద్వారా ప్రతినెలా 6,464 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇక్కడే రేషన్ దందా మొదలవుతుంది. బియ్యం తీసుకోవడానికి వచ్చిన లబ్ధిదారులతో కొందరు డీలర్లు బియ్యం కావాలా? బియ్యంకు సరిపోయే డబ్బులు కావాలా (కిలోకు రూ.10నుంచి 12) అంటూ.. వేలిముద్రలు తీసుకొని పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని తమ వద్దే ఉంచుకుంటున్నారు. డీలర్లు అలా సేకరించిన బియ్యాన్ని ప్రధానంగా మిల్లులకు అమ్ముతున్నట్లు ఆరోపణలు వినిపిస్తుండగా.. మరికొందరు వ్యాపారులకు రూ.25 నుంచి 30కి అమ్ముకుంటున్నారు. లబ్ధిదారుల నుంచి సేకరించిన బియ్యాన్ని మిల్లర్లు తిరిగి ప్రభుత్వానికే అమ్ముతున్నారు. ఇలా సేకరించిన బియ్యం మిల్లుల్లో పట్టుబడిన సంఘటనలు ఉన్నా.. అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మండలంకో ఏజెంట్..

డీలర్ల దగ్గర బియ్యం తీసుకున్న లబ్ధిదారుల నుంచి ఇంటింటికీ వెళ్లి సేకరించేందుకు వ్యాపారులు మండలంకో ఏజెంట్‌ను నియమించుకున్నారు. వీరు టూవీలర్, ఆటోల ద్వారా గ్రామాల్లో తిరుగుతూ బియ్యాన్ని సేకరిస్తున్నారు. వాటిని రైళ్లల్లో లేదా ఆటోల్లో మంచిర్యాలకు తరలించి అక్కడి నుంచి లారీల్లో మహారాష్ట్రకు తరలిస్తున్నారు. గ్రామాల్లో సేకరిస్తున్న సమయాల్లో కట్టడిచేయాల్సిన పోలీస్, పౌరసరఫరా శాఖలు నిర్లక్ష్యం వహిస్తున్నారు. బియ్యం అక్రమ తరలింపును అడ్డుకోవాల్సిన రైల్వే, పౌరసరఫరాల అధికారులు, పోలీసుశాఖల మధ్య సమన్వయం లేకపోవటం అక్రమార్కులకు కలిసివస్తోంది. ఈ మూడు శాఖల మధ్య సమన్వయం ఉంటే అక్రమ రవాణా చేయటం సాధ్యంకాదని అంటున్నారు.

నెలలో కనీసం రెండుసార్లు

రేషన్ దుకాణాల్లో తనిఖీలు మరిచిపోయారు. కొందరు డీలర్లు గుట్టుచప్పుడు కాకుండా బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ఈ-పాస్ విధానం అమల్లోకి వచ్చాక పర్యవేక్షణ గాడితప్పింది. నిజానికి ప్రతీ మూడు మండలాలకు ఒక డిప్యూటీ తహసీల్దార్ చొప్పున పనిచేయాలి. కానీ పౌరసరఫరాల శాఖలో మొత్తం నలుగురు డీటీలే పనిచేస్తున్నారు. అందులో ఒక్కరు సస్పెండ్ కాగా, మరొకరు డిప్యూటేషన్ మీద కలెక్టర్ వద్ద పని చేస్తున్నారు. దీంతో ఇద్దరు డీటీలతోనే నడిపిస్తున్నారు. ప్రతినెలా ప్రజాపంపిణీ విధానాన్ని తహసీల్దార్లు, ఆర్ఐలు పర్యవేక్షించాలి. నిబంధనల ప్రకారం ప్రతీ తహసీల్దార్ నెలలో కనీసం రెండు, ఆర్ఐ పది దుకాణాలు తనిఖీ చేయాలి. సరుకుల వివరాలు, పంపిణీ విధానం, నిల్వలను ఆయా దుకాణాల్లోని రిజిస్టర్‌ల్లో నమోదు చేయాలి. లబ్ధిదారులతో మాట్లాడి అభిప్రాయాలు తీసుకోవాలి. కానీ జిల్లాలో సిబ్బంది కొరతతో చూసీచూడనట్లు ఉంటున్నారు. పర్యవేక్షణ పూర్తిగా గాడితప్పడంతో కొందరు డీలర్లు దోపిడీకి తెరలేపుతున్నారు.

పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు

పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టిస్తే చర్యలుంటాయి. ప్రతినెలా క్రమం తప్పకుండా రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. డీలర్లు అక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నాం.

– ప్రేమ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, డీఈఓ మాధవితో కలిసి సమీక్షించారు. జిల్లాలో 535 ప్రభుత్వ పాఠశాలుండగా 453 పాఠశాలల్లో పనులు చేపట్టి పూర్తి చేశామని అధికారులు వివరించారు. పూర్తి చేసిన పనుల నాణ్యతను పరిశీలించి ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు నివేదిక ఇవ్వాలని సూచించారు. పనుల వివరాలను ఎంబీ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఎంపీడీవోల నివేదికలు అందిన తర్వాతే పెండింగ్ బిల్లులు చెల్లిస్తామన్నారు. అదనంగా పనులు అవసరముంటే నిధులు కేటాయిస్తామని, విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా పనులు పూర్తికావాలన్నారు. ఇక మిషన్‌భగీరథ పనుల విషయాలను ప్రస్తావిస్తూ ఇంటింటికీ తాగునీరందించేలా ప్రభుత్వం చేపట్టిన పథకం అమలు తీరుపై సాగుతున్న సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సీపీఓ రవీందర్, పంచాయతీరాజ్ ఈఈ గిరీష్‌బాబు, జెడ్పీ సీఈఓ నరేందర్, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈఓలతో పాటు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రోజూ రెండుగంటలు ప్రజల కోసమే..

కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంతో పాటు మంగళవారం నుంచి శనివారం వరకు రోజూ రెండు గంటలు (సాయంత్రం 3గంటల నుంచి 5గంటల వరకు) అందుబాటులో ఉంటూ సమస్యలు వింటానని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. జిల్లా ప్రజలు తనను పనిదినాల్లో కలవొచ్చన్నారు. సమస్యలు, ఫిర్యాదులు అందించేందుకు వచ్చేవారు ఆ సమయాల్లో కలెక్టరేట్‌కు రావాలని, ముందస్తుగా వచ్చి సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు.

'ధరణి' సమస్యలు పెండింగ్ ఉండొద్దు

జిల్లాలో ధరణి సమస్యలపై అందిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దని, వీలైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులను సమీక్షించారు. సమస్యల పరిష్కారానికి గడువు నిర్దేశించుకుని తప్పనిసరిగా పరిష్కరించాలని తహసీల్దార్‌లకును ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, ఆర్డీఓలు గంగయ్య, హనుమానాయక్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆకస్మిక సందర్శన



కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కోయ శ్రీహర్ష కలెక్టరేట్ ఆవరణలోని ఇన్‌వార్డు, ఔట్‌వార్డుతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు పరిశీలించి మనకు అందే ప్రతీ దరఖాస్తు వివరాలను ఇన్‌వార్డు, ఔట్‌వార్డు రిజిస్టర్‌లో పక్కాగా నమోదు చేయాలన్నారు. ఆయా ఆఫీసుల ఉద్యోగులు, సిబ్బందితో మాట్లాడి వివరాలపై ఆరా తీశారు. వసతులకల్పన, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటిస్తూ విధులను అంకితభావంతో నిర్వర్తించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఏవో శ్రీనివాస్ తదితరులున్నారు.

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్



పెద్దపల్లిరూరల్: జిల్లా జడ్జి హేమంత్‌కుమార్‌ను గురువారం కలెక్టర్ కోయ శ్రీహర్ష మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నులిపురుగు నివారణతోనే ఆరోగ్యం

పెద్దపల్లిరూరల్: నులిపురుగు నివారణతోనే పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం పెద్దపల్లి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. టీనేజీ పిల్లలు రక్తహీనతను నియంత్రించుకోవడంతో పాటు ఆరోగ్యంగా ఉండేందుకు నులిపురుగు నివారణకు అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని అన్నారు. వయస్సు నిర్ధారతను బట్టి మందుల డోస్‌చేరేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ మాధవి, డీఎంహెచ్ఓ ప్రమోద్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి, కమిషనర్ వెంకటేశ్‌తో పాటు జిల్లా అధికారులు కల్పన, రవుఫ్‌ఖాన్, రంగారెడ్డి, మెరాజ్‌మహమ్మద్, ఎంఈఓ సురేందర్, హెచ్ఎం అరుణ, వైద్యాధికారి మమత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



నులిపురుగు నివారణ మాత్రలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్, అడిషనల్ కలెక్టర్, డీఈఓ

పాఠశాల అభివృద్ధి పనుల పరిశీలన

గోదావరిఖనిటౌన్: గోదావరిఖనిలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అభివృద్ధి పనులను గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేసి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

ఆరోగ్య 'యోగ'ం







యోగా నిండు జీవితాన్ని పండించే ఓ మహామంత్రం. శరీరాన్ని, మనస్సును అస్వస్థత నుంచి కాపాడి స్వస్థత చేకూర్చే ఒక అద్భుత సాధనం. యాంత్రికమైపోతున్న దైనందిన జీవితాన్ని కాపాడే దివ్యౌషధం. మనిషి ఆలోచన తీరును, భావోద్వేగాలస్థాయిని సముచిత రీతిలో ఉంచే ఒక గైడ్ యోగా. శరీరాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుతుంది. మనస్సును ఉన్నతంగా తీర్చిదిద్దుతుంది. మంచి కుటుంబాన్ని, మంచి ఊరును, మంచి దేశాన్ని, మంచి ప్రపంచాన్ని తయారు చేస్తుంది. రోజురోజుకూ యోగా చేసే వారి సంఖ్య పెరుగుతోంది. అనేక చోట్ల యోగా శిక్షణ కేంద్రాలు వెలుస్తున్నాయి. అన్ని వయస్సుల వారు ఆసక్తి చూపుతున్నారు. జూన్ 21న 'అంతర్జాతీయ యోగా దినోత్సవం' సందర్భంగా జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించనున్నారు. - కోల్‌సిటీ(రామగుండం)

ప్రారంభానికి మోక్షం కలిగేనా?

- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో 'ఎల్లంపల్లి' ప్రారంభోత్సవంపై ఆశలు
- దివంగత సీఎం వైఎస్సార్ హయాంలోనే ప్రాజెక్టుకు శిలాఫలకం
- ప్రాజెక్టును గుర్తించని బీఆర్ఎస్ ప్రభుత్వం
- ప్రారంభోత్సవంపై నేటి కేబినెట్‌లో చర్చ?



ఎల్లంపల్లి ప్రాజెక్టు పైలాన్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామ అడుగులో నిర్మించిన ఎల్లంపల్లి (శ్రీపాద) ప్రాజెక్టుకు రెండు దశాబ్దాల క్రితం శంకుస్థాపన చేయగా దశాబ్దం క్రితం పూర్తిస్థాయి వినియోగంలోకి వచ్చినా ప్రారంభోత్సవానికి మాత్రం నోచుకోవడం లేదు. దీంతో రెండు దశాబ్దాల క్రితం ప్రాజెక్టు సమీపంలో నిర్మించిన పైలాన్ ఉత్సవ విగ్రహంగా మారింది. కాగా శుక్రవారం రాష్ట్ర కేబినెట్ భేటీ కానున్న క్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టు, ఎల్లంపల్లి ప్రాజెక్టుల అంశాలపై సుదీర్ఘ చర్చ కొనసాగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈనేపథ్యంలో ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే అయినందున ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి యుద్ధప్రాతిపదికన నిర్ణయం తీసుకోనుందా? అనే ఆశలు రేకెత్తుతున్నాయి.

దశాబ్దం క్రితం పూర్తిస్థాయి వినియోగంలోకి..

అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామ అడుగులో నిర్మించిన ఎల్లంపల్లి (శ్రీపాద) ప్రాజెక్టుకు రెండు దశాబ్దాల క్రితం శంకుస్థాపన చేయగా దశాబ్దం క్రితం నుంచి నీటి నిల్వలతో పూర్తిస్థాయి వినియోగంలోకి తీసుకొచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన వేళ ఉమ్మడి రాష్ట్ర హయాంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉధృతంగా ఉద్యమాలు కొనసాగుతున్న క్రమంలో 2012 జూన్‌లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రారంభోత్సవం చేసేందుకు హడావిడిగా ముహూర్తం నిర్ణయించారు. దీనిపై అప్పటి కరీంనగర్ ఎంపీ, ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యతిరేకించినప్పటికీ సీఎం పట్టుసడలనివ్వకుండా నేరుగా చార్టర్ ఫ్లైట్‌లో వచ్చి ప్రారంభోత్సవం చేస్తానని స్పష్టం చేయడంతో గాల్లోనే ఫ్లైట్‌ను పేల్చేస్తామంటూ పొన్నం వివాదాస్పద వ్యాఖ్యలతో సమాధానమిచ్చారు. ఈ క్రమంలో ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత కాంగ్రెస్ అధికారం కోల్పోయి టీఆర్ఎస్ అధికార పగ్గాలు చేపట్టింది. గడిచిన పదేళ్ల కాలంలో ఏనాడూ ఎల్లంపల్లి ప్రాజెక్టును ప్రారంభోత్సవం చేయాలనే ఆలోచన మాజీ సీఎం కేసీఆర్‌కు రాకపోవడం తెలంగాణ ప్రజల దురదృష్టకరం. ఆరేళ్ల క్రితం కాళేశ్వరం ప్రాజెక్టును లక్షలాది కోట్ల నిధులతో యుద్ధ ప్రాతిపదికన నిర్మించిన మూడేళ్ల వ్యవధిలోనే అట్టహాసంగా ప్రారంభోత్సవం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎత్తిపోతలకు అనుకూలంగా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఎల్లంపల్లి ప్రాజెక్టును వినియోగించారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్వపరాలు

- జలయజ్ఞంలో భాగంగా జనహృదయ నేత, దివంగత ఉమ్మడి రాష్ట్ర సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి జూలై 28, 2004న శ్రీపాద(ఎల్లంపల్లి) ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.
- తాగు, సాగు, పారిశ్రామిక అవసరాల నిమిత్తం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.2744 కోట్లు కేటాయించారు.
- ప్రాజెక్టును స్టేజ్-1, స్టేజ్-2గా విభజించారు.
- ఫేజ్-1లో ప్రాజెక్టు(డ్యాం) నిర్మాణం, ఫేజ్-2లో 6.5 టీఎంసీల నీటిని ఎన్టీపీసీకి పైపులైన్లతో నీటి సరఫరా చేయడం.
- 36 నెలల్లోగా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలనే ఒప్పందం ఉన్నప్పటికీ వరదల కారణంగా పూర్తయ్యేందుకు దశాబ్దకాలం పట్టింది.
- పదేళ్ల క్రితం నుంచి పూర్తిస్థాయి వినియోగంలోకి రాగా ప్రాజెక్టు సామర్థ్యం మేరకు నీటి నిల్వ తోపాటు నీటి కేటాయింపులను ప్రారంభించారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం

- ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి విద్యుత్ అవసరాల దృష్ట్యా ఎన్టీపీసీకి 6.5 టీఎంసీ నీటి సరఫరా.
- మంథని ఎత్తిపోతల పథకం ద్వారా కమాన్‌పూర్, మంథని నియోజకవర్గ పరిధిలో 20వేల ఎకరాలకు సాగునీరు.
- ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఎగువ భాగంలో కడెం ఎత్తిపోతల పథకం కింద 3టీఎంసీల నీటిని 30వేల ఎకరాలు స్థిరీకరించుట.
- కరీంనగర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలోని 19 మండలాలకు చెందిన 206 గ్రామాల్లో రెండు లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు. ఇందుకు వేంనూర్‌లో 12 టీఎంసీలను పంపింగ్ చేసేందుకు పంప్‌హౌస్ నిర్మాణం.
- 160 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించ తలపెట్టిన ప్రాణహిత-చేవెళ్ల భారీ ప్రాజెక్టుకు ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఉపయోగపడుతుంది.
- అబ్దుల్ కలాం సుజల స్రవంతి పథకంలో భాగంగా 10 టీఎంసీల నీటిని గ్రేటర్ హైదరాబాద్‌కు తాగునీటి అవసరాల నిమిత్తం పైపులైన్ల ద్వారా సరఫరా.
- ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా పరిధిలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు మిషన్ భగీరథ పథకంలో ప్రాజెక్టును హ్యాబిటేషన్‌గా గుర్తించి నీటిని సరఫరా చేస్తున్నారు.
- ప్రాజెక్టులో పూడిక తొలగింపుకు ఆధునిక పరిజ్ఞానం.
- శ్రీపాద ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీ (నీటి చుక్క లేకుండా) నీటిని బయటకు పంపించే అవకాశం ఉంది. ఫలితంగా నిల్వ నీటిలో పేరుకుపోయిన మట్టి, పూడిక అంతా వరదలో కొట్టుకుపోవడంతో ప్రాజెక్టులో ఉన్న నీటి సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించే వీలుంటుంది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


అక్షయ్‌కుమార్ (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కడారి అక్షయ్‌కుమార్(30) అలియాస్ అంజి అనే యువకుడు మృతి చెందాడు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. కమాన్‌పూర్ శివారు గ్రామమైన కిష్టంపల్లికి చెందిన అక్షయ్‌కుమార్ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సామగ్రి కొనుగోలు కోసం పెద్దపల్లికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మార్గ మధ్యంలో సబ్బితం శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్షయ్ అక్కడికక్కడే మరణించాడు. మృతుడి తండ్రి రాజబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామానికి చెందిన సింగరవేన తిరుపతి(33) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. తిరుపతి హార్వేస్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తిచెంది ఈ నెల 15న ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య రక్షిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

బాలికను వేధించిన యువకుడి అరెస్ట్

మెట్‌పల్లి: పట్టణానికి చెందిన బాలికను వేధించిన కేసులో బత్తిని నవదీప్ అనే యువకుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఆయన కథనం ప్రకారం..బాలికను నవదీప్ కొన్నిరోజులుగా వేధిస్తుండడంతో ఈనెల 12న తల్లి ఫిర్యాదు చేయగా, అతనిపై ఫోక్సో కింద కేసు నమోదు చేయడం జరిగింది. ఈ మేరకు గురువారం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

గ్యాస్ సిలిండర్ పేలి మహిళకు గాయాలు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ఇస్లాంపురకు చెందిన మంజూర్ బేగ్ ఇంట్లో గురువారం పిండివంటలు చేస్తుండగా గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ఘటనతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. అప్రమత్తమైన స్థానికులు నీళ్లు చల్లి మంటలను అదుపు చేయడంతో పెద్దప్రమాదం తప్పింది. వంట చేస్తున్న హాఫియాకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లారు.

లారీ, జేసీబీ పట్టివేత


పోలీసులు పట్టుకున్న లారీ

గన్నేరువరం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని మండలంలోని గుండ్లపల్లి స్టేజీ వద్ద గురువారం పట్టుకున్నట్లు ఎస్సై తాండ్ర నరేశ్ తెలిపారు. తిమ్మాపూర్ మండలం రేణికుంట శివారులో ఇసుకను డంపు చేసి అక్కడి నుంచి లారీ ద్వారా తరలిస్తున్నారనే సమాచారంతో లారీ, జేసీబీని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. లారీ డ్రైవర్ కోరెపు సంపత్‌రెడ్డి, జేసీబీ అపరేటర్ మెండ శ్రీకాంత్, యాజమానులు కొండు గారి తిరుపతిరెడ్డి, గూడెల్లి నరేశ్, ఇసుకను డంపు చేయించిన చింతల అనిల్‌పై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై వివరించారు.

పాటల పల్లకిలో...

- సిరిసిల్లలో స్వరాగాల సవ్వడి
- కార్మికక్షేత్రంలో సంగీత నిలయాలు
- నేడు ప్రపంచ సంగీత దినోత్సవం



పాట.. రెండు అక్షరాల పదం.. లయబద్ధంగా సాగితే.. వీనుల విందు చేస్తుంది. ఉద్యమ గీతమైనా.. దేవుడి స్తోత్రమైనా.. జానపదమైనా.. సినిమా పాటలైనా.. లలిత సంగీతమైనా.. విషాద గీతమైనా.. మనసుకు హత్తుకునేదే పాట. ఏదో ఒక్క సమయంలో రాగాలను ఆలపించని వారు ఉండరు. అలాంటి పాటలతోటలో వికసించిన పూలెన్నో. సిరిసిల్ల.. అంటేనే వస్త్రోత్పత్తికి ఖిల్లా. మరమగ్గాల సవ్వుడు మధ్య స్వరాగాల సవ్వడులు సందడి చేస్తున్నాయి. అద్భుతమైన పాటలకు ప్రాణం పోస్తున్న సంగీత దర్శకులు ఉన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఎందరో గాయకులు సిరిసిల్లకు వచ్చి పాటలను రికార్డు చేసుకునే స్టూడియోలు ఇక్కడ ఉన్నాయి. శుక్రవారం ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల స్వరాగాల సవ్వడులపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

సిరిసిల్ల:సిరిసిల్లలో ఆర్కెస్ట్రా బృందాలే కాదు.. యూట్యూబ్ ఆల్బమ్‌లను తీర్చిదిద్దే సంగీత దర్శకులు, సాంకేతిక పరిజ్ఞానం ఉంది. కార్మిక క్షేత్రంలో పురుడుపోసుకున్న పాటలెన్నో ఎల్లలు దాటి సందడి చేస్తున్నాయి. 'బలగం' సినిమాలో 'హరి హరి రాఘవులే.. అయ్యో బాలి బాలి' అంటూ.. ఆ సినిమా దర్శకుడు యెల్దండి వేణు రాగం ఎత్తితే ప్రేక్షకులు కన్నీరు పెట్టారు. 'కమ్మనైన అమ్మ పాట వింటే ఎంత మధురమో..' అంటూ.. జీఎల్ నాందేవ్ అందించిన సంగీతం ప్రతి ఒక్కరి హృదయాలను బరువెక్కించింది. 'అమ్మ నేను బోతున్న లంకలోనికి.. సీతమ్మ జాడ తేవడానికి' అంటూ.. జడల రమేశ్ అందుకున్న గానం ఎల్ల లు దాటింది. 'ఏమే పిల్లా అన్నప్పుడల్లా.. గుచ్చే పూల బాణాలు..' అంటూ.. శిరీష పాడితే.. ఆ పాట మోగని గల్లీ లేదు. కోనరావుపేట మండలం మరిమడ్లకు చెందిన మాట్ల తిరుపతి రాసిన పాటలు సాహిత్యకారులను మన్ననలు అందుకున్నాయి. ఇలా సిరిసిల్ల ప్రాంతంలోని సంగీత దర్శకులు, గాయకులు, సంగీతం ప్రపంచంలో తమదైన ముద్ర వేసుకున్నారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి.. 'నన్ను దోచు కుందువటే.. వన్నెల దొరసాని' అంటూ.. ప్రారంభించిన పాటల సాగు వారసత్వాన్ని రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన ఎందరో యువకవులు, కళాకారులు, గాయకులు, రచయితలు ముందుకు తీసుకెళ్తున్నారు.

వినసొంపైన పాటలు



మూడున్నర దశాబ్దాలుగా సంగీతాన్ని అందిస్తున్నాను. సాంబారి ప్రదీప్ ఫ్రెండ్స్ ఆర్కెస్ట్రాలో పాల్గొంటూ సంగీతంపై ఆసక్తి పెరిగి ఇటువైపు వచ్చాను. మొదట్లో వరంగల్ శంకరన్న, సారంగాపాణి పాటలు స్ఫూర్తినిచ్చాయి. దుబాయి, మస్కట్, కువైట్, సౌతాఫ్రికాల్లో జరిగిన అనేక సంగీత వేడుకల్లో పాల్గొన్నాను. ఇప్పటి వరకు పది వేలకు పైగా పాటలకు సంగీతం అందించాను. మ్యూజిక్ కంపోజ్ చేస్తూ.. ఈ రంగమే జీవనాధరంగా సొంత రికార్డింగ్ స్టూడియోను నెలకొల్పాను.

– జీఎల్ నాందేవ్, సంగీత దర్శకుడు, సిరిసిల్ల

ఆరేళ్లుగా పాడుతున్నా..



బావల్లు.. నా బావల్లా.. ముద్దు ముద్దుల బావల్లా..., అత్తాకొడుకా.. ముద్దుల మారి ఎల్లయ్య.. లాంటి జానపదాలు గుర్తింపునిచ్చాయి. ఆరేళ్లుగా పాటలు పాడుతున్నా. ఇప్పటి వరకు 1500 వరకు పాటలు పాడాను. విదేశాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చాను. టీవీ షోలు చేశాను. తొలుత చిన్నగా స్కూల్ స్థాయి నుంచే పాటలు పాడడం మొదలుపెట్టాను. అందరి ప్రోత్సహంతో పాటల ప్రపంచంలో సాగిపోతున్న.

– శిరీష, గాయని, సిరిసిల్ల

ముప్పై ఏళ్లుగా పాటల సాగులో...



నేను చదువుకుంది ఏడోతరగతి. సిరిసిల్లలో సాంచాలు నడిపించాను. ముంబైకి వలస వెళ్లాను. ముప్పైఏళ్లుగా పాటల బాటలో సాగిపోతున్న. రచయితగా, గాయకుడిగా, మిమిక్రీ ఆర్టిస్ట్‌గా గుర్తింపు దక్కింది. నేను పాడిన కొండగట్టు అంజన్న, వేములవాడ రాజన్న, కొమురవెల్లి మల్లన్న భక్తి పాటలు ఎన్నో ఉన్నాయి. పేరడి పాటలు, జోక్స్ క్యాసెట్లను రికార్డు చేశాం. అయ్యప్ప భజన పాటలు, జానపదాలు.. ఇలా పాటలే జీవితంగా హైదరాబాద్‌లో ఓ పాటల రికార్డింగ్ స్టూడియోతో సాగిపోతున్నా.

– జడల రమేశ్, రచయిత, గాయకుడు, సిరిసిల్ల

జానపదాల పూదోటలో..



మాది ముస్తాబాద్ మండలం బదనకల్. నేను ఐదేళ్లుగా పాటలు పాడుతున్నాను. ఎక్కువగా జానపదాలు పాడాను. రామగిరి పాట, దచ్చన్న వారింటి పాటలు గుర్తింపునిచ్చాయి. ఇప్పటి వరకు 650 పాటలు పాడాను. పాటలపై ఆసక్తితోనే గాయనిగా గుర్తింపు సాధించాలని ఇటువైపు వచ్చాను. మా కుటుంబ సభ్యులు ప్రోత్సహించారు. జానపద పాటలనే నేను ఎక్కువగా పాడాను. కొన్ని పాటల్లో నేను నటించాను. అనేక టీవీ షోలు, యూట్యూబ్ ఆల్బమ్‌ల్లోనూ పాల్గొన్నాను.

– నాగలక్ష్మి, గాయని, బదనకల్

కీబోర్డు ప్లేయర్‌గా ప్రవేశం



నేను డిగ్రీ వరకు చదువుకున్న. కీబోర్డు ప్లేయర్‌గా ముందుగా ఈ రంగంలోకి వచ్చాను. రెండేళ్లు క్లాసికల్ సంగీతం, కర్నాటక సంగీతంలోనూ శిక్షణ పొందాను. సంగీత దర్శకుడిగా నాకు రంగుసీతమ్మ.. వంటి ఫోక్ సాంగ్స్‌తో గుర్తింపు వచ్చింది. మా బావ కనకాచారి స్ఫూర్తితోనే ఈ రంగంలోకి వచ్చాను. వెయ్యి పాటల వరకు సంగీతాన్ని అందించాను. ఇంకా అందిస్తున్న. ఆర్కెస్ట్రా కళాకారుడిగా అనేక షోల్లో పాల్గొన్నాను.

– ప్రవీణ్ కాయితోజు, సంగీత దర్శకుడు, సిరిసిల్ల

తలాపున పారుతోంది గోదారి



తెలంగాణ ఉద్యమంలో భాగంగా నేను పాడిన 'తలాపున పారుతోంది.. గోదారి.. మన ఊరు.. మన సేను ఎడారి..' అనే పాట నాకు గుర్తింపునిచ్చింది. 1989 నుంచి మా గురువు సుద్దాల బాలయ్య వెంట వెళ్లి అనేక పాటలు పాడాను. చిన్నప్పుడు నేను పాడిన 'తెగపడ్డా నింగి చుక్కలం.. అయ్య అవ్వ లేని అనాథలం' పాట చాలా పాపులర్ అయింది. భక్తిపాటలు, జానపదాలు, జోక్స్ మిమిక్రీ వంటి రంగాల్లోనూ రాణించాను. వేలాది పాటలు పాడాను.

– ఆకునూరి దేవయ్య, గాయకుడు, మిమిక్రీ ఆర్టిస్ట్

ప్రమాదవశాత్తు పంచాయతీ కార్మికుడి మృతి

- బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు చెల్లించాలి
- సిరిసిల్లలో సీఐటీయూ నాయకుల ధర్నా


గసికంటి పోచయ్య (ఫైల్)

వేములవాడరూరల్/సిరిసిల్ల టౌన్: వేములవాడరూరల్ మండలం నూకలమర్రిలో గురువారం గ్రామపంచాయతీ కార్మికులు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పై నుంచి పడి ప్రాణాలు కోల్పోయాడు. బాధిత కుటుంబానికి రూ.10లక్షలు పరిహారం చెల్లించాలని కార్మికనాయకులు డిమాండ్ చేశారు. నూకలమర్రికి చెందిన గసికంటి పోచయ్య(65) కొన్నేళ్లుగా పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం రోజుమాదిరిగానే విధులకు హాజరయ్యాడు. ట్రాక్టర్‌పై వెళ్తుండగా డ్రైవర్ పొత్తూరి రఘు మూలమలుపు వద్ద కరెంట్‌పోల్‌ను ఢీకొట్టడంతో పోచయ్య కిందపడ్డాడు. వెంటనే వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయన భార్య గసికంటి లచ్చవ్వ ఫిర్యాదుతో వేములవాడరూరల్ సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. మృతునికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వేములవాడ డీపీవో వీరబుచ్చయ్య, డీఎల్పీవో నరేశ్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పరిహారం చెల్లించాలి

విధి నిర్వహణలో ట్రాక్టర్‌పై నుంచి పడి చనిపోయిన పంచాయతీ కార్మికుడు పోచయ్య కుటుంబానికి


జిల్లాసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు, సీఐటీయూ నాయకులు

రూ.10లక్షలు పరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. పోస్టుమార్టం కోసం సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి మృతదేహాన్ని తీసుకురాగా అక్కడే కార్మికులు, నాయకులు ధర్నా చేశారు. జీపీ కార్మికుల ప్రాణాలకు భరోసా లేకుండా పోయిందన్నారు. డీఎల్‌పీవో వచ్చి కలెక్టర్‌తో మాట్లాడి రూ.5లక్షలు నష్టపరిహారం అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్, నాయకులు మల్యాల నర్సయ్య, అన్నల్‌దాస్ గణేష్, లింగంపల్లి కృష్ణవేణి, గంగరాజు మహేష్, శ్రీనివాస్, రవీందర్, శేఖర్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నూకలమర్రి గ్రామపంచాయతీలో మృతిచెందిన పంచాయతీ కార్మికుడి కుటుంబానికి కలెక్టర్ రూ.50వేలు ఆర్థికసహాయం మంజూరు చేశారు. ఆ చెక్కును బాధిత కుటుంబానికి వేములవాడ రూరల్ తహసీల్దార్ సుజాత అందజేశారు.

రెస్టారెంట్‌లలో తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని రెస్టారెంట్లలో గురువారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన మాంసాహారంను పరిశీలించారు. వంటశాలలు అపరిశుభ్రంగా ఉండటాన్ని గ్రహించి జరిమానాలు విధించారు. నాణ్యమైన ఆహారాన్ని అందించడంతో పాటు వంటశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తనిఖీల్లో మున్సిపల్ అధికారులు రమాకాంత్, అనిల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పులిపాక రాజు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న బియ్యంతో అధికారులు

ధర్మారం: మండలంలోని నర్సింహులపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన వంద క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం పట్టుకున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఓపెన్‌గా ఉన్న ప్రాంతంలో రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీ చేయగా దాదాపు వంద క్వింటాళ్ల బియ్యంను గుర్తించామని అన్నారు. పట్టుకున్న బియ్యానికి పంచనామా నిర్వహించి ఎంఎల్ఎస్ పాయింట్‌లో భద్రపర్చుతున్నట్లు తెలిపారు.

బస్టాండ్‌లోకి దూసుకెళ్లిన బస్సు



సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోకి బుధవారం అర్ధరాత్రి బస్సు దూసుకెళ్లడంతో టేలా పూర్తిగా ధ్వంసమైంది. గోదావరిఖని డిపోకు చెందిన బస్సు కరీంనగర్ నుంచి గోదావరిఖని వెళ్తోంది. ప్రయాణికుల కోసం బస్టాండ్‌లోకి వెళ్లగా బ్రేకులు ఫెయిల్ కావడంతో టేలాను ఢీకొంది. టేలా పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. బస్సు అద్దాలు పగలడంతో స్వల్పనష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు.

ఘటనా స్థలాన్ని సందర్శించిన అధికారులు

సుల్తానాబాద్: ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగిన ప్రమాద సంఘటన స్థలాన్ని గురువారం ఆర్టీసీ టెక్నికల్ ఏఈ సంధ్యారాణి సందర్శించి పరిశీలించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కమలతో పాటు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ బస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్న చిన్నచెవ్వ అనిత(30)అనే వివాహిత గురువారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భార్యాభర్తలు వంటపాత్రలు అమ్ముకుంటూ జీవిస్తున్నారు. ఇరువురి మధ్య తరచూ గొడవలు జరిగేవి. గురువారం ఉదయం భార్యాభర్తలు గొడవ పడగా మానస్తాపం చెందిన అనిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

ఈడీని కలిసిన ఆర్‌ఎంలు


వినోద్‌కుమార్‌తో రీజియన్ల మేనేజర్లు

విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ వరంగల్, ఖమ్మం రీజియన్‌లకు నూతన రీజియన్ మేనేజర్లుగా నియమితులైన డి.విజయభాను, ఎ.సరిరాంలు శుక్రవారం కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పదోన్నతిపై వచ్చిన వారిద్దరిని అభినందించారు.

కేంద్రమంత్రిని కలిసిన గ్రూప్–1 అభ్యర్థులు


కేంద్ర మంత్రి సంజయ్‌కి వినతిపత్రం అందిస్తున్న గ్రూప్–1 అభ్యర్థులు

కరీంనగర్‌టౌన్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను గురువారం గ్రూప్–1 అభ్యర్థులు కలిసి వినతిపత్రం అందించారు. గ్రూప్–1 మెయిన్స్ కోసం ప్రిలిమ్స్ నుంచి 1:100 చొప్పున ఎంపిక చేసేలా చూడాలని కోరారు. గత నాలుగేళ్లలో మూడుసార్లు గ్రూప్–1 పరీక్షను రద్దు చేయడంవల్ల నిరుద్యోగులకు తీవ్రనష్టం జరిగిందని మంత్రి ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 1:100 చొప్పున మెయిన్స్‌కు ఎంపిక చేస్తామని గత ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా పట్టించుకోవడం లేదని వాపోయారు. గ్రూప్–1 పోస్టులు అత్యధికంగా ఉండటంతో 1:50 చొప్పున మెయిన్స్‌కు ఎంపికచేస్తే నిరుద్యోగులకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం 1:100 చొప్పున మెయిన్స్‌కు ఎంపిక చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చకపోతే భారీఎత్తున ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కాగా.. స్పందించిన కేంద్ర మంత్రి సంజయ్ మాట్లాడుతూ... నిరుద్యోగుల డిమాండ్ న్యాయమైనదేనని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 1:100 చొప్పున మెయిన్స్‌కు ఎంపిక చేయాలని, నిరుద్యోగుల డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

శరణార్థులను ఆదుకోవాలి


జాతీయ శరణార్థుల దినోత్సవంలో విద్యార్థులతో అల్ఫోర్స్ చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో గురువారం జాతీయ శరణార్థుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో మానవాళికి అన్ని రకాలుగా సహాయపడాలన్నారు. ఆహారం, వస్త్రాలు అందించడంలో ముందుండాలని కోరారు. నేటి సమాజంలో శరణార్థులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని, వారి గురించి పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. శరణార్థులకు ఆపన్నహస్తం అందించాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటైనర్ ఢీకొని బీడీ టేకేదార్ దుర్మరణం


ఘటనా స్థలంలో విలపిస్తున్న కుటుంబీకులు


మహేశ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కంటైనర్ డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలైంది. బడుగు జీవి కుటుంబం వీధిన పడింది. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్, స్థానికులు తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన బీడీ టేకేదార్ ఊరడి మహేశ్(34) ద్విచక్ర వాహనంపై గురువారం తన ఇంటికి వెళ్తుండగా.. గొల్లపల్లి బస్టాండ్‌లో కంటైనర్ ఢీకొట్టింది. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కంటైనర్ కొద్ది దూరం లాక్కెళ్లడంతో మహేశ్ తలపగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కంటైనర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో అతి వేగంగా కామారెడ్డి నుంచి సిరిసిల్ల వైపునకు వెళ్తూ మహేశ్ బైక్‌ను ఢీకొట్టాడు. మృతుని భార్య లావణ్య, తండ్రి వరాహస్వామి, కూతరు, కుమారుడు ఘటన స్థలానికి చేరుకుని రోదించిన తీరు అక్కడున్న వారిని కదలించింది. సీఐ శ్రీనివాస్‌గౌడ్ ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్‌పై చర్యలు తీసుకొని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఊటూరు పీఏసీఎస్ చైర్మన్‌కు ఊరట

- తాత్కాలికంగా సస్పెన్షన్ ఎత్తివేత

మానకొండూర్‌రూరల్: మండలంలోని ఊటూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ముద్దసాని ప్రదీప్‌రెడ్డి నిధులు దుర్వినియోగం చేశారని సంఘం డైరెక్టర్ల ఆరోపణలపై డీసీవో రామానుజాచారి ఈనెల 12న చైర్మన్‌ను పదవి నుంచి తొలగిస్తూ నోటీసులు జారీచేసిన విషయం తెలిసిందే. దీంతో ప్రదీప్‌రెడ్డి వరంగల్‌లోని కో ఆపరేటివ్ ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌దారులు కోర్టుకు సమర్పించిన ఆధారాల్లో స్పష్టత లేనందున అతడిపై ఉన్న సస్పెన్షన్‌ను తాత్కాలికంగా ఎత్తివేయడంతో గురువారం తిరిగి సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సొసైటీ అభివృద్ధికి రైతులు, డైరెక్టర్లు సహకరించాలన్నారు. రాజకీయ కక్షలతో సంఘం అభివృద్ధి కుంటుపడుతుందని, వ్యక్తిగత కక్షలను సొసైటీపై చూపవద్దని హితవు పలికారు. పెట్రోల్, డీజిల్ బంకుల పనులు పూర్తిచేసి త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ ప్రదీప్‌రెడ్డి

పోలీసులను ఆటపట్టించిన ఆకతాయి

- కిడ్నాప్ చేస్తున్నారంటూ డయల్ 100కు ఫిర్యాదు

చందుర్తి (వేములవాడ): కారులో వచ్చి తనను కిడ్నాప్ చేస్తున్నారంటూ డయల్ 100కు కాల్ చేసి పోలీసులను ఆటపట్టించిన సంఘటన చందుర్తి మండలం బండపల్లిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. గురువారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో తనను కొందరు కిడ్నాప్ చేస్తున్నారని బండపల్లికి చెందిన రాజిరెడ్డినంటూ డయల్ 100కు కాల్ చేశాడు. వెంటనే బ్లూకోర్ట్స్ సిబ్బంది బండపల్లికి వచ్చి ఫిర్యాదు వచ్చిన సెల్‌ఫోన్ నంబర్‌కు కాల్ చేయగా.. తాగిన మైకంలో కాల్ చేశానంటూ వివరాలు చెప్పకుండా దాటవేశాడు. చివరికి పోలీసులు రాజిరెడ్డి అనే వ్యక్తి ఎవరంటూ ఆరా తీయగా.. ఎవరూ సరైన వివరాలు చెప్పలేదు. మరోసారి ప్రయత్నించగా... ఆశిరెడ్డిపల్లెకు చెందిన వ్యక్తిని అని , మరోసారి బావుసాయిపేట అంటూ తప్పించుకోసాగాడు. చివరికి ఫోన్ నంబర్ ఆధారంగా వివరాలు సేకరించి తప్పుడు సమాచారం ఇచ్చిన వ్యక్తిపై కేసు నమోదు చేస్తామని గ్రామస్తులకు చెప్పి వెనుదిరిగారు.

పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ పట్టణంలో ఎల్కతుర్తి మండలం వల్బపూర్‌కు చెందిన బాపురావు(48)అనే వ్యక్తి గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నీరుకుల్ల గ్రామానికి చెందిన తిరుపతిరావుకు తన చెల్లె నిర్మలను నాలుగేళ్ల క్రితం ఇచ్చి పెళ్లి చేశాడు. కాగా తన చెల్లెలు బుధవారం బావిలో పడి మృతి చెందింది. ఆమె మృతిపై అనుమానాలు ఉన్నాయని, తనకు న్యాయం జరగడం లేదని మానస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ విషయమై ఎస్సై శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా మృతురాలి బంధువులు గురువారం వరకు ఫిర్యాదు ఇవ్వలేదని తెలిపారు.